అదనపు నైపుణ్యాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు

● సింప్లీలెర్న్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో అదనపు నైపుణ్యాలను పొందడం ద్వారానే మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమని నేటి తరం భావిస్తుందని సింప్లీలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. 18-27 సంవత్సరాల వయసు కలిగిన జెన్ జెడ్ తరాన్ని సింప్లీలెర్న్ సంస్థ అధ్యయనం చేసింది. ఈ వివరాలను సింప్లీలెర్న్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కశ్యప్ దలాల్ తెలిపారు. మన దేశంలో యువతకు నైపుణ్యం మెరుగుపరచడం ద్వారా దాదాపు 10కోట్ల మందిని వర్క్‌ఫోర్స్‌లోకి తీసుకురావచ్చని తెలిపారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇది దోహదపడుతుందని, 2030 నాటికి అంతర్జాతీయంగా వర్క్‌ఫోర్స్‌లో 30% జెన్ జెడ్ ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిశ్రమలో మారుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి జెన్ జెడ్ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటుందని వివరించారు. అదనపు నైపుణ్యాలను కోరుకుంటున్న వారిలో 66% బ్యాచులర్ డిగ్రీలను కలిగి ఉన్నారని తెలిపారు. దాదాపు 60% మంది అభ్యాసకులు ప్రస్తుతం ఐటీ రంగంలో ఉపాధి పొందుతుంటే, 40% మంది ఐటీయేతర రంగాలలో ఉపాధి పొందుతున్నారని, 83% మంది జెన్ జెడ్ ఉద్యోగులు మెరుగైన ఉద్యోగావకాశాలు పొందడానికి అదనపు నైపుణ్యాలను పొందాలని గట్టిగా కోరుకుంటున్నారని వెల్లడించారు. ఇలా కోరుకునే వారిలో బిజినెస్ ఎనలిటిక్స్‌ను 35.3% కోరుకుంటుంటే, ఏఐ, మెషీన్ లెర్నింగ్ టూల్స్ అభ్యసించాలని 33.9%, సైబర్ సెక్యూరిటీని 20.2% కోరుకుంటున్నారని ఆయన వివరించారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ


మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ సలాం షాహిద్

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): చావునీ డివిజన్‌లోని గుడ్డిబౌలి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మహిళలకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌బలాల కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కుట్టుపై ఆసక్తి ఉన్న మహిళలకు 3 నెలలపాటు శిక్షణ నిచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. శిక్షణపూర్తి చేసిన 50 మంది మహిళలకు కుట్టుమిషన్లతోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. చావునీ కార్పొరేటర్ సలాం షాహిద్, ఎంఐఎం మలక్‌పేట మహిళా ఇన్‌చార్జి నజీమా పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి : కార్పొరేటర్

కొత్తపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లోని కాలనీల్లో తాగునీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జలమండలి జీఎం బలరామ్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. మంగళవారం ఆయన జీఎంను కలిసి సమస్యలను వివరించారు. డివిన్‌లోని రాజీవ్‌గాంధీనగర్-1లో నూతన తాగునీటి పైప్‌లైన్ వేయాలన్నారు. కాలనీల్లో జలమండలి చేపట్టిన పైప్‌లైన్ పనులతో పాడైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. వినాయక చవితి వేడుకలు ఆరంభమవుతున్నాయని ప్రజలకు మండపాలకు వెళ్లే దారుల్లో డ్రైనజీతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దారుణంగా తయారయ్యాయని జీఎంకు విన్నవించారు. పలు కాలనీల్లో పాత మ్యాన్‌హోళ్లు పాడయ్యాయని, వాటి మరమ్మతులకు సత్వరచర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జీఎంకు వినతి పత్రం అందజేశారు.

ఆయుర్వేదం విశిష్టమైన ప్రకృతి వైద్య విధానం

-సీఎస్ఐఆర్ డెరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి


జ్యోతి ప్రజల్వన చేస్తున్న సీఎస్ఐఆర్ డెరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొ.వైద్య రబీ నారాయణ

సైదాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదవైద్యం అనేది వేదాలు, పంచ భూతాల ఆధారంగా ప్రకృతిపరంగా అందించబడిన విశిష్టమైన వైద్యవిధానమని సీఎస్ఐఆర్ డెరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఎంహెచ్)లో రెండురోజులపాటు నిర్వహించనున్న సాంప్రదాయ వైద్యంలో ఔషధ అభివృద్ధిపై జాతీయ సెమినార్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సెమినార్‌లో సీసీఆర్ఏఎస్ డైరక్టర్ జనరల్ ప్రొఫెసర్ వైద్య రబీ నారాయణ అచార్య ఆర్‌అండ్‌డీ హెల్త్‌కేర్ కోల్‌కత్తా సలహాదారు డాక్టర్ చంద్రకాంత్ కటియార్, ఎన్ఐఎంహెచ్ అసిస్టెంట్ డైరక్టర్(ఇన్‌చార్జి) డాక్టర్ జీపీ.ప్రసాద్, ఆయుర్వేద శాస్త్రవేత్తలు, వైద్యులు, ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన 50 మంది పరిశోధనా అధికారులు, 100 మందికి పైగా శాస్త్రవేత్తలు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

ఓటరు జాబితాలను పరిశీలించాలి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన బూత్‌లలోని ఓటర్ల జాబితాను పరిశీలించాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో ఎలాంటి తప్పులూ దొర్లకుండా జాగ్రతపడాలని అన్నారు. డోర్ టు డోర్ సర్వే ద్వారా జాబితాను సరిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బాలాపూర్ తహసీల్దార్ ఇందిర, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, మీర్‌పేట్ ఆర్వో చంద్రశేఖర్, మేనేజర్ చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి : సీపీఐ

హయత్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాలకు గ్రామాలే నీటమునిగి ప్రజలు సర్వం కోల్పోయారని, రాష్ట్రం అతలాకుతలం అవుతోందని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. మంగళవారం హయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలకు రవాణా, వ్యవసాయం, ప్రాణ, ఆస్తినష్టం తీవ్రస్థాయిలో వాటిల్లిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరాశ్రయులైన ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున మునిసిపల్ పారిశుధ్య సిబ్బందితో పాటు యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది సైతం అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ సూచించారు. ఆశ కార్యకర్తలు, కార్పొరేషన్‌లోని ఇతర విభాగాల సిబ్బంది తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆయన అన్నారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి పెట్టి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

పోచమ్మగుడిలో అన్నప్రసాద వితరణ

చంపాపేట, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని శ్రీపోచమ్మ దేవస్థానం ఆవరణలో మంగళవారం మాతా అన్నపూర్ణేశ్వరీ అన్నప్రసాద ట్రస్ట్‌చైర్మన్ భగవాన్ ఆధ్వర్యంలో 600 మందికి అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, ట్రస్ట్‌సభ్యులు సుశీల్‌కుమార్, సంతోష్‌లడ్డా, ప్రవీణ్, వెంకటేష్, చింటూ, రాజు, వుంకటేష్, టింగ్లీకర్ రాజేష్, శానవాజ్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

● సమస్యల పరిష్కారానికి నిధులు ఇవ్వండి



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరుతున్న బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి
- వనస్థలిపురం

వినాయక చవితికి భారీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

శ్రీహనుమాన్ దేవస్థానంలో...

చంపాపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ ఎన్.లావణ్య తెలిపారు. ఈనెల 7న ఉదయం 5:30 గంటలకు మూలవిరాట్ శ్రీవరసిద్ధి వినాయకస్వామికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, హారతి, మంత్రపుష్పం, 9 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, మంటపారాధన, విగ్రహారాధన చేయనున్నారు. 10:30 గంటలకు గణపతిహోమం, మహాహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం 6 గంటలకు సహస్రనామార్చన, చవితిపూజలు నిర్వహించనున్నట్లు ఈఓ పేర్కొన్నారు. గణపతి నవరాత్రులను పురష్కరించుకొని ఉదయం 7:30 గంటల నుంచి 8:30 వరకు, సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్నట్లు, ఈనెల 14న ఉదయం 10 గంటలకు స్వామి వారి రెండు లడ్డూలకు వేలంపాట, 16న ఉదయం 8గంటలకు దుర్వాంకుర గణపతి హోమం, మహా పూర్ణాహుతి, గణపతి ఉద్వాసన, ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి : మేయర్

సరూర్‌నగర్: వినాయక చవితి సందర్భంగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. మంగళవారం నాదర్‌గుల్‌లోని తోట యెట్టారెడ్డి గార్డెన్స్‌లో ఆదిభట్ల పోలీసుల ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది ఈ ఉత్సవాల్లో భాగస్వాములై తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు. సమావేశంలో ఆదిభట్ల ఎస్‌హెచ్‌వో రాఘువేందర్‌రెడ్డి, ఎస్సై రాజు, ఆదిభట్ల మునిసిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, మునిసిపల్ డీఈఈ జ్యోతీరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ కాంతిలాల్

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి : సౌత్ ఈస్ట్ డీసీపీ

సైదాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్‌పాటిల్ సూచించారు. మంగళవారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ హాల్‌లో భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు నగర పోలీసు కమిషనర్ విధించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులు రౌండ్ ది క్లాక్‌గా విధులు నిర్వర్తిస్తూ అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శైలజ ఉత్సవసమితి ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, ఉగాది మహేష్, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏడాదైనా వ్యర్థాలను తొలగించరా?

పూడుకుపోతున్న మాసబ్ చెరువు


గతేడాది నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల కర్రలు, మట్టితో నిండిన వ్యర్థాలు

హయత్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువులో గత సంవత్సరం నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల వ్యర్థాలను అధికారులు నేటికీ తొలగించలేదు. దీంతో చెరువు పూడుకుపోతోంది. ఈ సంవత్సరం కూడా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనుండడంతో చెరువు మరికొంత భాగం పూడుకుపోయే ప్రమాదం ఉంది. చెరువు సమీపంలో ఉన్న ఓ రియల్ వ్యాపారి ఇప్పటికే ఒక పక్క నుంచి మాసబ్ చెరువును మట్టితో పూడ్చుతున్నాడు. నిమజ్జనం తరువాత వ్యర్థాలు ఒక చోటకు చేర్చడంతో సదరు వ్యాపారి ఇదే అదనుగా భావించి మధ్యలో ఉన్న నీటిని మట్టితో నింపి చదును చేస్తున్నాడు. వాస్తవంగా ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనం పూర్తి కాగానే విగ్రహాల తయారీకి వాడే కర్రలు, మట్టి, ఇనుప చువ్వలను తొలగించాల్సి ఉంటుంది. కానీ తుర్కయంజాల్ మాసబ్ చెరువులో వినాయక నిమజ్జనం పూర్తికాగానే అధికారులు తమకు ఏమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువులోని వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి


మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భిక్షపతిచారి తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రానున్న గణేశ్ నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని అన్ని రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, రోడ్లకు ఇరు వైపులా ఉన్న చెట్లకొమ్మలను తొలగించాలని, గణేశ్ శోభాయాత్ర సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు, కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి మునిసిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు నిమజ్జనాలు జరుగనున్నందున సదరు పది రోజులూ ఇక్కడి మంత్రాలచెరువు వద్ద క్రేన్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెరువుల్లో ఉత్సవ నిర్వాహకులు పూలు, పత్రి, ఇతర వస్తువులు పడేయకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు కె.సోమేశ్వర్, ఎ.భీమ్‌రాజ్, కీసరి హరినాథ్‌రెడ్డి, పల్లె జంగయ్యగౌడ్, తీగల సాయినాథ్‌రెడ్డి, బి.నర్సింహాయాదవ్, వి.గోపీనాథ్‌చారి, వేణుగోపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీశైలంయాదవ్, రాంగోపాల్, కార్తీక్ సాగర్, శంకర్ పాల్గొన్నారు.

బాటసింగారం శివాజీచౌక్ వద్ద అండర్ పాస్ నిర్మించండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పలు గ్రామాల ప్రజల వినతి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామాల ప్రజలు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): బాటసింగారం శివాజీచౌక్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మించాలని మాజీ ఎంపీటీసీ బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు పలు గ్రామాల ప్రజలు మంగళవారం కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బాటసింగారం పాతరోడ్డు శివాజీ చౌక్ వద్ద వాహనాల మళ్లింపునకు ఎలాంటి అవకాశం లేకపోడంతో పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని...దీంతో సుమారు 16 గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందని కేంద్రమంత్రికి వివరించారు. వాహనదారులు, ప్రజలసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని అక్కడ అండర్‌పాస్‌ను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ యాదగిరిగౌడ్, కోట వెంకటరెడ్డి, రామసాని మోహన్‌రెడ్డి, జంగయ్యగౌడ్, వెంకటరంగారెడ్డి, భీమయ్య, నర్సింహ, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, సీలింగ్, అసైన్డ్, భూదాన్, చెరువు, కుంటలు ఎఫ్‌టీఎల్ భూములను కబ్జాల నుంచి కాపాడాలని నూతనంగా వచ్చిన తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి బీజేపీ నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాల కబ్జాకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలుతీసుకుని కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు విష్ణుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, వీరస్వామిగౌడ్, మోహన్‌రెడ్డి, రమాదేవి, కొండల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, రామకృష్ణ, సాయి, వెంకటేష్‌గౌడ్, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి : ఎంపీ ఈటల


కుమ్మరిబస్తీలో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

చంపాపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని, తన నియోజకవర్గపు నిధులతో కాలనీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చంపాపేట డివిజన్ కుమ్మరిబస్తీలో రూ.56లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను మంగళవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎంపీ ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లోని మారుతీనగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కాలనీ ప్రతినిధుల సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడారు. ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న సమస్యలను ఎంపీ సహకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిల్వేరు అనిల్‌కుమార్, నాయకులు పాశం శ్రీశైలం, గాజుల శేఖర్, శ్రీనివాస్‌నాయుడు, సుమిత్‌సింగ్, కళ్యాణ్, శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్, కాలనీ అధ్యక్షుడు రమేష్, కాలనీ ప్రతినిధులు సుదర్శన్‌గౌడ్, బాబు, ప్రవీణ్, రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, రఘునందన్‌రెడ్డి, బలరాంరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ పెద్దచెరువును మరింత అభివృద్ధి చేస్తాం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పెద్దచెరువు కట్ట వెడల్పు పనులతోపాటు కట్ట బలోపేతానికి సైతం పలు చర్యలు తీసుకున్నామని, భవిష్యత్‌లో చెరువును మరింతగా అభివృద్ధి చేస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. చెరువుకట్టపై కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను సోమవారం రాత్రి మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, స్థానిక 11వ డివిజన్ కార్పొరేటర్ ధనలక్ష్మీరాజ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గతంలో చిన్న వానకే ఇక్కడి కాలనీలు ముంపునకు గురయ్యేవని, తాను ఈ సమస్యపై ప్రత్యేకదృష్టి సారించి ఎస్ఎన్‌డీపీ నాలాలు, ట్రంక్‌లైన్‌ను నిర్మింపజేసి సమస్యను దాదాపు దూరం చేశానని అన్నారు. కేవలం లోతట్టు ప్రాంతాల్లోని ఐదారు కాలనీల్లో మాత్రమే ప్రస్తుతం వర్షం నీరు చేరుతున్నదని, త్వరలో అక్కడి సమస్యనుశాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. పెద్ద చెరువును మరింత అభివృద్ధి చేస్తానని, ఇందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సబిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్యబీరప్ప, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, భిక్షపతిచారి, హరినాథ్‌రెడ్డి, భీమ్‌రాజ్, గౌరీశంకర్, అనిల్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేశ్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ నాయకులు పి.విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మాధవి, నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల 'మండీ'


మాదన్నపేట మార్కెట్‌లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తకుప్పలు, కుళ్లిన వ్యర్థాలు

సైదాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గుట్టలుగా చెత్తకుప్పలు, మరోవైపు వర్షాల కారణంగా కుళ్లిన వ్యర్థాల మండిగా మాదన్నపేట కూరగాయల మార్కెట్ మారింది. మార్కెటింగ్ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై రైతులు, వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మార్కెట్‌లో నెలల కొద్ది పారిశుధ్య నిర్వహణ చేయకపోవడంతో చెత్తకుప్పలు గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో మార్కెట్‌లో నిలిచిన వరద నీరు, బురద, కూరగాయల వ్యర్థాలు పేరుకుపోయి తీవ్రదుర్వాసన వస్తోంది. అడుగు తీసి వేయలేని పరిస్థితి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో మాదన్నపేట కూరగాయల మార్కెట్ మురికికూపంగా మారింది.

13న పెద్దఅంబర్‌పేట్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవిపై మెజార్టీ కౌన్సిలర్లు ప్రకటించిన అవిశ్వాస బలపరీక్షకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 13వ తేదీన అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశాన్ని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ ప్రత్యేక సమావేశం జరుగనుంది. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 17 మంది మెజార్టీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలతో కూడిన లేఖను గత ఆగస్టు 19న రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తోపాటు పట్నం ఆర్డీఓకు అందజేశారు. కౌన్సిలర్ల సంతకాల పరిశీలన అనంతరం అధికారులు ఈనెల 13న బలపరీక్షపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులను మంగళవారం అందజేశారు. దీంతో బలపరీక్షపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత చైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడం..అవిశ్వాసం ప్రకటించిన మెజార్టీ సభ్యులు కూడా అదే పార్టీకి చెందిన వారు కావడంతో ఆసక్తి నెలకొంది. అయితే ప్రత్యేక సమావేశానికి మొత్తం 17 మంది కౌన్సిలర్లు హాజరై తమ మద్దతు తెలియజేయాల్సి ఉంటుంది.

జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఘనంగా ఉర్సు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉర్సును మంగళవారం ఘనంగా నిర్వహించారు. హజరత్ సయ్యద్ ఇస్మాయిల్ షా ఖాద్రీ దర్గా షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర గోపిశంకర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు సలీంసాబ్, సయ్యద్ శంషుద్దీన్, యాకూబ్, పాషా, షఫీ, రఫీ, హెస్సెన్, అన్నుభాయ్, ఇమ్రాన్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి వాచ్‌మన్ మృతి

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అపార్టుమెంట్‌పై అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు నుంచి వాచ్‌మన్ కిందపడి, తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం ఉదయ్‌గిర్ ప్రాంతానికి చెందిన భీమ్‌శంకర్ అలియాస్ భీమేష్(39), లక్ష్మి దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి సరూర్‌నగర్ భగత్‌సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. భీమేష్ 3 సంవత్సరాలుగా శ్రీవెంకటేశ్వరకాలనీలోని శ్రీబాలాజీ నివాస్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం వినాయకమండపానికి సంబంధించిన సామగ్రి తీసుకువచ్చేందుకు అపార్ట్‌మెంట్‌పై అంతస్థులోని స్టోర్‌రూమ్‌కి వెళ్లాడు. పనిముగిశాక స్టోర్ రూమ్ తలుపుపెడుతుండగా, తలుపు హుక్కు ఊడిపోయింది. దీంతో చేయి జారి పైనుంచి కిందపడ్డాడు. వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి భీమేష్‌ను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను చంపిన భర్తకు జైలు, జరిమానా

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించి ఉరేసి చంపిన భర్తకు 10 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.5,50,000 జరిమానా విధిస్తూ 10వ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి జయలక్ష్మి తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతిరెడ్డి కథనం ప్రకారం.. శంకర్‌పల్లికి చెందిన చింతకింది మౌనేష్‌గౌడ్, చింతకింది లక్ష్మీ దంపతులు. మౌనేష్‌గౌడ్ అదనపు కట్నం కోసం భార్య లక్ష్మిని వేధించి ఉరేసి హతమార్చాడు. లక్ష్మి కుటుంబీకుల ఫిర్యాదుతో శంకర్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా 10వ అదనపు సెషన్స్ జడ్జి జయలక్ష్మి నిందితుడికి 10 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.5,50,000లు జరిమానా విధించి మౌనేష్‌గౌడ్ తల్లిదండ్రులను నిర్దోషులుగా పేర్కొంటూ తీర్పు చెప్పారు.

ఫోన్ చోరీ కేసులో యువకుడి అరెస్ట్

సైదాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఫోన్ స్నాచింగ్ చేసి విక్రయించడానికి యత్నిస్తున్న యువకుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్‌చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సింగరేణి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ మేతరి నరేష్(32) ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలోని రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్నాడు. ఇంతలో ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి నరేష్ జేబులో మొబైల్ ఫోన్ లాక్కున్నాడు. అతడిని పట్టుకోగా నరేష్‌ను కిందపడవేసి పారిపోయాడు. దీంతో బాధితుడు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సాయంత్రం నిందితుడు రమావత్ శ్రీకాంత్(24) దొంగిలించిన మొబైల్ ఫోన్‌ను సింగరేణికాలనీలో విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సైదాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో పోగొట్టుకున్న నగదు వృద్ధురాలికి అప్పగింత

వనస్థలిపురం, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆటోలో పోగొట్టుకున్న రూ.15వేల నగదు బ్యాగును గుర్తించిన పోలీసులు బాధితురాలికి తిరిగి అప్పగించారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వనస్థలిపురంలోని ప్రశాంత్ నగర్ చెందిన సైదాబీ(70) పనిమీద ఆటోలో ప్రశాంత్‌నగర్ నుంచి సచివాలయ నగర్‌కు వెళ్లింది. ఈ క్రమంలో తనవెంట తెచ్చుకున్న 50వేల నగదు ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మరచి ఇంటికి వెళ్లింది. ఇంటికెళ్లిన కాసేపటికి నగదు ఉన్న బ్యాగును ఆటోలో పోగొట్టుకున్న విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించిన పోలీసులు ఆటోడ్రైవర్‌ను పట్టుకొని నగదు బ్యాగు, సెల్‌ఫోన్‌ను బాధితురాలికి అప్పగించారు. దీంతో పోలీసులకు సైదాబీ కృతజ్ఞతలు తెలిపారు.